క్లుప్తంగా

అమ్మవార్లకు ఆషాఢ సారె సమర్పణ



స్థానిక పెద్దింటి అమ్మవారికి సారెలు సమర్పిస్తున్న ఉపేంద్ర భజన మండలి మహిళలు

ఆకివీడు: ఆషాఢ మాస శుక్రవారం సందర్భంగా అమ్మలగన్న అమ్మలు గ్రామ దేవతలు, కులదేవతలకు సారె(బోణాలు)ను మహిళలు సమర్పించారు. స్థానిక ఉపేంద్ర భజన మండలి ఆధ్వర్యంలో మహిళలు ప్రదర్శనగా స్థానిక పెద్దింటి అమ్మవారి ఆలయానికి, వనువులమ్మ అమ్మవారి ఆలయానికి, వాసవీ మాత ఆలయానికి వెళ్లి సారెలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సారెలు తీసుకువచ్చిన మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

కాళ్ల మెడికల్ ఆఫీసర్‌గా సునీల్ బాధ్యతల స్వీకరణ



పీవీఎల్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న డాక్టర్ సునీల్

కాళ్ల: మండలంలోని కాళ్ల ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ -2 గా పెదఅమీరం గ్రామానికి చెందిన సరాబు సునీల్ బాధ్యతలు స్వీకరించారు. దీనిలో భాగంగా శుక్రవారం డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పీవీఎల్ మెడికల్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన సునీల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపీపీ పెన్మెత్స విశ్వనాథరాజు, సరాబు ముఖేష్, తదితరులు ఉన్నారు.

శాకంబరిగా దుర్గాదేవి



ప్రత్యేక అలంకరణలో కోమటిగుంట దుర్గాదేవి

కాళ్ల: మండలంలోని కోమటిగుంట గ్రామంలో కొలువై ఉన్న దుర్గాదేవి అమ్మవారు శాకంబరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం శుక్రవారం సందర్భంగా ఆలయనిర్మాణ కర్త ఎరుబండి రామాంజనేయులు రత్న కుమారి దంపతులు ఆధ్వర్యంలో అమ్మవారికి ఆషాఢం సారె బిందెలతో మహిళలు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున్న భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

నెలాఖరుకు రెండో విడత టిడ్కో ఇళ్లు

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



భీమవరంలో మునిసిపల్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: పట్టణంలోని టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు రెండో విడత జూలై నెలాఖరు నాటికి పంపిణీ చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ అధికారులు ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ టి.సుధాకర్, ఎంఈ త్రినాథరావు, డీఈలు అప్పలరాజు, విజయ్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించిన అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇప్పటికే మొదటి విడతలో రెండు వేల మంది లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు స్వాధీనం చేశామని మరో రెండు వేల గృహాలను లబ్ధిదారులకు అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించనట్లు చెప్పారు. ఇప్పటికే టిడ్కో ఇళ్లల్లో నివసిస్తున్న వారికి అన్ని సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారుల పేరున రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నామని శ్రీనివాస్ తెలిపారు. టిడ్కో గృహ సముదాయల వద్ద వాడకపు నీటిని శుద్ధి చేసే ఎస్‌టీపీ ట్యాంక్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. టిడ్కో ఇళ్లకు సంబంధించి ప్రతి బ్లాక్‌కు నివాసితులతో అసోసియేషన్లు ఏర్పాటు చేయాలని తద్వారా బ్లాక్‌ల్లో ఇబ్బందులు తలెత్తినప్పుడు అసోసియేషన్లు సమస్యలను పరిష్కరించే విధంగా పనిచేస్తాయన్నారు. అసోసియేషన్ల అవశ్యకతను అధికారులు అక్కడి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి టెండర్లు ఖరారైన పనులను వెంటనే ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని హెచ్చరించారు. వర్షాలు కురుస్తున్నందున మురుగునీరు వేగంగా పారేందుకు పట్టణంలోని అన్ని వార్డుల్లోని డ్రెయిన్స్‌లోను వెంటనే పూడిక తీసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పూడిక తొలగింపునకు మున్సిపల్ అధికారులు సచివాలయాల్లో పని చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్స్‌తో స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. పట్టణాన్ని అభివృద్ధి చేయడానికి మున్సిపల్ అధికారులు చిత్తశుద్ధితో పని చేసి ప్రజలు, ఉన్నతాధికారుల మన్ననలు పొందాలని అధికారులకు సూచించినట్లు ఎమ్మెల్యే శ్రీనివాస్ చెప్పారు.

నేడు వైఎస్సార్ జయంతి వేడుకలు

ఉండి: మండలంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 74వ జయంతి వేడుకలను డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో శనివారం ఉండిలో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు తెలిపారు. ఉండి పోలీస్‌స్టేషన్ ప్రక్కన గల వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహించే ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన తెలిపారు.

నాడు-నేడు పనుల పరిశీలన

ఆకివీడు: మండలంలోని నాడు-నేడు పనుల పరిశీలనకు సెంట్రల్ టీమ్ బృందం శుక్రవారం పర్యటించింది. మండలంలోని చెరుకుమిల్లి జెడ్పీ స్కూల్, ఎంపీపీ స్కూల్, పట్టణంలోని ఉర్దూ గరల్స్ స్కూల్, ధర్మాపురం, సమతానగర్‌లోని ఎంపీపీ స్కూల్‌ల్లో పనుల్ని పరిశీలించారు. పనులు జరిగిన తీరు, నాణ్యత ప్రమాణాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జి.రూప్‌కుమార్, పంచాయతీరాజ్ ఏఈ రమణమ్మ, నాడు-నేడు పనుల పరిశీలకులు బొడ్డు రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గ్రంథితోనే గ్రామాభివృద్ధి సాధ్యం



విలేకరులతో మాట్లాడుతున్న తిరుమాని శ్రీనివాస్

భీమవరం అర్బన్: ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ వల్లనే గతంలో ఎన్నడూ లేనంతగా ఈ నాలుగేళ్లలో తోకతిప్ప గ్రామం ఎంతగానో అభివృద్ధి చెందిందని ఆ గ్రామ అభివృద్ధి కమిటీ కన్వీనర్ తిరుమాని శ్రీనివాస్ అన్నారు. భీమవరంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తీర ప్రాంత గ్రామం కావడంతో వర్షం వస్తే మట్టిలోంచి నడిచేవారమన్నారు. అంతేకాకుండా భారీ వర్షం పడితే మోకాళ్ల లోతులో వర్షపు నీరు ఉండిపోయేవని ఎన్నిసార్లు టీడీపీ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తమ గ్రామంపై ప్రత్యేక దృష్టి పెట్టి సీసీ రోడ్లు, 95 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతో 45 మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుని ఇళ్లల్లోకి వెళ్లారన్నారు. మరో 50 మందికి ఇళ్ల నిర్మించుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారన్నారు. ఈ నాలుగేళ్లలో రూ. కోటి 40 లక్షలు అభివృద్ధి పనులు జరిగాయన్నారు. అంతేకాకుండా గ్రామస్తులు స్వచ్ఛమైన త్రాగునీరు అందించేందుకు ఫిల్టర్ బెడ్‌లు, పైపు లైనులు, పంప్ హౌస్‌లు ఏర్పాటు చేశారన్నారు. గ్రామంలో ఏ సమస్య వచ్చిన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్తే వెంటనే పరిష్కరిస్తున్నారు. గ్రామాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకువెళ్లిన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు గ్రామస్తులు రుణపడి ఉంటారన్నారు.

టెక్నాలజీతో మీడియా రంగం అభివృద్ధి



భీమవరం డీఎన్నార్ కళాశాలలో మాట్లాడుతున్న జాన్‌బాబు

సాక్షి, భీమవరం: దేశంలో మీడియా రంగం ఎంతో అభివృద్ధి చెందిందని టెక్నాలజీ పెరగడంతో అనేక వార్త పత్రికలు, ఛానల్స్ అందుబాటులో ఉన్నాయని జమ్మూకాశ్మీర్ సెంట్రల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ కొయ్యే జాన్‌బాబు అన్నారు. భీమవరం డీఎన్నార్ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయడంలో మీడియా పాత్ర అనే అంశంపై ఆయన మాట్లాడారు. గతంలో మీడియా అంటే కేవలం వార్తా పత్రికలు, రేడియో, టీవీ మాధ్యమాలు మాత్రమే ఉండేవని ప్రస్తుతం ట్విట్టర్, ఇన్‌స్టాగామ్, వాట్సాప్, ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటివి ఎన్నో అందుబాటులోనికి వచ్చాయన్నారు. అయితే న్యూస్ విషయంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఫేక్ న్యూస్ వస్తున్నాయని వాటి పట్ల జాగ్రత్త వహించాలని జాన్‌బాబు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, సెక్రటరీ అండ్ కరస్పాడెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు), ప్రిన్సిపాల్ బీఎస్ శాంతకుమారి, అధ్యాపకులు గౌతమ్‌కుమార్, ఎంఎల్ నారాయణరాజు, టి.చిట్టిబాబు, చెల్లబోయిన రంగారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మేలు చేయడానికే జగనన్న సురక్ష



పెనుగొండలో జగనన్న సురక్షను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

పెనుగొండ: రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి మేలు చేయడానికే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్షకు శ్రీకారం చుట్టిందని కలెక్టరు పి.ప్రశాంతి తెలిపారు. శుక్రవారం పెనుగొండలో నిర్వహించిన జగనన్న సురక్షలో పాల్గొన్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఇతర ధ్రువీకరణ పత్రాలపైనా దృష్టి సారించాలని ఆదేశించారు. సంక్షేమ పథకాలు అందనివారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. శాఖల మధ్య సమన్వయం ఉన్నప్పుడే ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా మంచి ఫలితాలు వస్తాయన్నారు. జిల్లా నీటి పారుదల శాఖాధికారి ఎస్‌వీరావు, తహసీల్దారు ఎస్.గురుమూర్తి రెడ్డి పాల్గొన్నారు.

బాడవలో ప్రతి ఇంటికి తాగునీరు

యలమంచిలి: బాడవ గ్రామంలో నిర్మిస్తున్న వాటర్ ట్యాంకును త్వరలోనే ప్రారంభించి ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందిస్తామని ఎమ్మెల్సీ, పాలకొల్లు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ చెప్పారు. బాడవ గ్రామంలో శుక్రవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే పరమావధిగా జగనన్న పాలన సాగిస్తుంటే ఆయనకు వస్తున్న ప్రజాదరణను చూసి తట్టుకోలేకే ప్రతి పక్షాలు అర్థం పర్థంలేని ఆరోపణలతో అనవసర విమర్శలు చేస్తున్నాయన్నారు. అవినీతి, సిఫారసులకు తావు లేకుండా అభివృద్ధి పథకాలను పెద్ద ఎత్తున అమలు చేస్తూనే అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న మీ బిడ్డ జగనన్నను ప్రజలంతా ఆదరించాలని శ్రీనివాస్ కోరారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఇలపకుర్తి లక్ష్మీ నరసింహారావు, సర్పంచ్ రాయి వెంకట కనకదుర్గ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు వినుకొండ మాణిక్యాలరావు (చిన్న), సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ రావూరి రామకృష్ణ వైఎస్సార్ సీపీ నాయకులు గవర చంద్రరావు, గెల్లు గణపతి, ఇంటి గంగాధర్, చవ్వాకుల పెద్దిరాజు, దిగమర్తి అగస్టీన్, రాయి కృష్ణ, దేవరపు కృష్ణ, మేడిచర్ల నాగేశ్వరరావు మండల ప్రత్యేక అధికారి బి.వీరాస్వామి, తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

9న లయన్స్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ఉండి: ఈ నెల 9వ తేదీ ఆదివారం ఉదయం 9:30 గంటలకు ఉండి లయన్స్ ఆడిటోరియంలో ఉండి లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు క్లబ్ ప్రతినిధులు తెలిపారు. అధ్యక్ష, కార్యదర్శులు వేగేశ్న అనంతలక్ష్మీ, కన్నెగంటి రూత్‌కళ, కోశాధికారి సాగిరాజు సూర్యకుమారి తదితర నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేస్తున్నట్లు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

పాలకోడేరు: మండలంలోని మోగల్లు శివారు గుత్తులవారి పాలెంలో పేకాట శిబిరంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.3,100లు స్వాధీనం చేసుకున్నట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు. వీరిని కోర్టులో హాజరుపరుస్తామని పేర్కొన్నారు.

చిన్నతనంలో లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి



దిరుసుమర్రులో అమ్మఒడి చెక్‌ను అందిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి

భీమవరం అర్బన్: విద్యార్థులు చిరుప్రాయంలో లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని కోసం అహర్నిశలు కష్టపడి సాధించాలని డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి అన్నారు. భీమవరం మండలంలోని దిరుసుమర్రు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నాలుగో విడత అమ్మఒడి రూ.24 కోట్ల 25 లక్షల 20 వేల నమూనా చెక్‌ను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డీసీఎమ్ఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి మాట్లాడుతూ గతంలో ఎంతోమంది పేద విద్యార్థులు చదవాలంటే సరియైన అవకాశాలు, వసతులు లేకపోవడంతో వారి తల్లిదండ్రులే కూలీ పనులకు పంపించేవారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత కుటుంబంలో ఒక్కరూ చదువుకున్నా ఆ కుటుంబం ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందడమే కాకుండా రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని భావించి విద్యా రంగంపై సుమారు రూ. 67 వేల కోట్లు ఖర్చు పెట్టారన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన ఆంధ్రప్రదేశ్‌లో ఏ ముఖ్యమంత్రి అంత ఖర్చు పెట్టలేదని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విజన్‌తో ముందుకు వెళ్తున్నారన్నారు. జగనన్న విద్యా కానుక ద్వారా విద్యార్థులకు ఏక రూప దుస్తులు, షూస్, పాఠ్యపుస్తకాలు, టైతో సహ 6 రకాల వస్తువులు ఇచ్చారన్నారు. అంతేకాకుండా విద్యార్థులు ఆరోగ్యం బాగుండాలని వారానికి ఐదు రోజులు జగనన్న గోరుముద్ద ద్వారా చిక్కీలు, రాగిజావ, గుడ్లు పౌష్టికాహారం అందిస్తున్నారు. కార్యక్రమంలో జిల్లా మండల పరిషత్ ఛాంబర్ సంఘం అధ్యక్షులు పేరిచర్ల విజయనర్సింహరాజు, జెడ్పీటీసీ సభ్యుడు కాండ్రేగుల నరసింహరావు, ఉప విద్యాశాఖాధికారి డి. శ్రీరామ్, ఎంపీడీవో కె.వెంకటలక్ష్మి, సర్పంచ్ కోళ్ల బాలకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు తేలి జోషఫ్ రవికుమార్, కేతా నాగమణి, అల్లూరి యర్రరాజు, ఎమ్ఈవో వేండ్ర వెంకటేశ్వరరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ జంపన తేజశ్విని, చిల్లే వెంకటేష్, కలిదిండి ఫణిరాజు పాల్గొన్నారు.